వరికి తెగుళ్ల బెడద

- పంటలను కాపాడుకునేందుకు రైతన్నల అవస్థలు
- దిగుబడి తగ్గుతుందని ఆందోళన
- మందుల పిచికారీకి భారీగా ఖర్చు
- రెండు నెలలు కాపాడుకుంటేనే పంట చేతికొచ్చే అవకాశం


గువ్వలకుంట్ల సమీపంలో ఎండాకు తెగులు సోకి దెబ్బతింటున్న వరిపంట

పగిడ్యాల/కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో కేసీ ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటకు తెగుళ్ల బెడద అధికంగా ఉండడం వలన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పైర్లు మూడు నెలల దశలో ఉన్నాయి. యూరియా కొరత వేధిస్తున్నా బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసి పైపాటు ఎరువులను చల్లుకున్నారు. ప్రస్తుతం మందులను స్ప్రే చేస్తూ పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు రైతన్నలు అవస్థలు పడుతున్నారు.

4 వేల ఎకరాల్లో వరి సాగు

పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పీకే ప్రాగటూరు, అర్లపాడు, బీరవోలు, పగిడ్యాల, సంకిరేణిపల్లె, తూర్పు, పడమర ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పైరును అగ్గి తెగులు(ఆకు మచ్చ), నల్లదోమ, పచ్చదోమ, చిలుక ఆశించడం వలన సస్య రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆర్థిక భారంతో రైతులు అల్లాడిపోతున్నారు. కొత్తపల్లి మండలంలోని గువ్వల కుంట్ల, బండినాయిని పాలెం, పాలెంచెరువు, జి.వీరాపురం, కొత్తపల్లి, బావాపురం, నందికుంట, శివపురం, పెద్దగుమ్మడాపురం గ్రామాల్లో 1000 హెక్టార్లలో వరి పంట వేశారు. పైరుకు ఎక్కువగా దోమపోటు, ఎండాకు తెగులు సోకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట కాల వ్యవధి ఐదు నెలలు కావడం వలన మరో రెండు నెలల పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకోకపోతే చేతికి వచ్చే పరిస్థితులు ఉండవని ఆందోళనకు గురవుతున్నారు.

ఎకరాకు రూ.40వేలు ఖర్చు

ఇప్పటికే ఎకరాకు రూ.40వేల చొప్పున పెట్టుబడుల రూపంలో ఖర్చు చేశారు. ఒక్కసారి పిచికారి చేసేందుకు రూ. 3వేల నుంచి రూ.4వేల దాకా రసాయనిక మందులకు వెచ్చించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులకోసారి పిచికారీ చేయాల్సి ఉన్నందున మందులకే రూ. 20 వేలకు పైగానే ఖర్చు అవుతోందని, ఈ లెక్కన పంట చేతికి వచ్చేసరికి మందులకే ఎకరానికి రూ. 40 వేలు పెట్టుబడి ఖర్చులు అవుతాయని వాపోతున్నారు.


బండినాయిని పాలెం వద్ద దోమపోటుతో ఎండిపోతున్న పైరు


వరిమొక్కల మొదళ్లను అంటిపెట్టుకొని ఉన్న దోమ

పంటలు దెబ్బతింటున్నాయి



నేను 1.5 ఎకరాల్లో సోనా మసూరి వరిరకాన్ని సాగుచేసుకున్నా. ఇప్పటి వరకు సుమారు రూ.40 వేలు దాకా పంట సాగు కోసం ఖర్చు చేశా. ఇప్పుడు పంట పొట్టదశకు వచ్చింది. కొద్ది రోజులు ఉంటే కంకి వస్తుంది. ఇప్పుడు ఎండాకు తెగులు సోకుతోంది. దీంతో పంటమొత్తం ఎండిపోయినట్లుగా కనిపిస్తుంది. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గడంలేదు.

– ఎస్.మల్లయ్య, రైతు, వీరాపురం గ్రామం

పైరు ఎండుతోంది



4 ఎకారాల్లో వరి పంటను సాగుచేసుకుంటున్నా. ఇప్పుడు పంటలో కంకి విడిచే దశకు చేరుకున్నాయి. అయితే అధిక వర్షాల కారణంగా పంట మొదళ్లలో గోధుమ, తెల్ల మచ్చల దోమలు అధికంగా ఉంది. దీంతో పంట మొత్తం బిళ్లలు, బిళ్లలుగా ఎండుగడ్డి లాగా మారి వరి చనిపోతుంది. దిగుబడి తగ్గిపోతుందని భయమేస్తుంది. మందులు పిచికారీ చేసినా ప్రయోజన లేకుండా పోతుంది. – వై.చంద్రబాబు, రైతు, గువ్వలకుంట్ల గ్రామం

మందులు పిచికారీ చేయాలి

అగ్గితెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ (బీమ్), లేదా నెటివో మందును లీటర్ నీటికి 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలి. అలాగే పచ్చదోమ, చిలుక, పురుగు నివారణకు క్లోరో అంత్రిపో (ఆంప్లిగో) మందును లీటర్ నీటికి 2ఎంఎల్ నుంచి 4 ఎంఎల్ వరకు కలిపి పిచికారీ చేయాలి. మందులు స్ప్రే చేసుకోవడానికి పొలంలో కాలిబాటలు చేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు వాడాలి. – మురళీధర్, మండల వ్యవసాయ అధికారి, పగిడ్యాల

వరిలో ఎండాకు తెగులు

బండి ఆత్మకూరు : మండలంలోని పలు గ్రామాలలో వరి పంటకు ఎండాకు తెగులు విస్తరిస్తోంది. దీంతో పంట దిగుబడి తగ్గి, తీవ్రంగా నష్ట పోయే ప్రమాదముందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటల్లో తెగులు వ్యాపించిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనివల్ల పంటకు పసుపు మచ్చలు వచ్చి క్రమంగా పెద్దవై ఆకు ఎండిపోవడం వలన మొక్కలు బలహీనమై దిగుబడి తగ్గుతుందన్నారు. అందువల్ల రైతులు ఎండాకు తెగులు సోకిన పంటకు తక్షణమే సిఫార్సు చేసిన మందులను పిచికారీ చేసి, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నష్టం అంచనా వేసి, సాయం అందించాలంటూ రైతులు కోరుతున్నారు.


బండి ఆత్మకూరు మండలం సోమయాజుల పల్లిలో ఎండాకు తెగులు సోకిన వరి పైరు

పీఎండీడీకేవైపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హేమలత

ఆత్మకూరు: ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన సందర్భంగా శనివారం మండలంలోని కరివేన గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో లైవ్ టెలికాస్ట్ చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గురించి వివరించారు. ఇతర దేశాల నుంచి దిగుమతిపై ఆధారపడకుండా కేవలం వరి, గోధుమ వంటి పంటలే గాకుండా ప్రోటీన్ అధికంగా ఉండే పప్పుధాన్య పంటలను మరింతగా ప్రోత్సహించాలన్నారు. పీఎండీడీకేవై అనేది వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి, వంద జిల్లాల్లో వ్యవసాయాన్ని ఆధునికీకరించడానికి చేపట్టారని చెప్పారు. ఏఈఓ సతీష్, వీపీఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి

వెలుగోడు: ప్రధానమంత్రి ధన్–ధాన్య కృషి యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో స్వాతి సూచించారు. పీఎం ధన్–ధాన్య కషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా శనివారం ప్రారంభించారు. పథకం ఉద్దేశాలను రైతులకు వివరించారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షతో ప్రవేశ పెట్టిన ఈ పథకం ఆరేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం ద్వారా బడ్జెట్ విడుదల అవుతుందని చెప్పారు.

14న మున్సిపల్ సాధారణ సమావేశం

నందికొట్కూరు: ఈనెల 14వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు.మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

క్లుప్తంగా

శుభకార్యం


వివాహ వేడుకలో శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు, అఫియా ప్రశాంతి దంపతుల కుమార్తె బ్లెస్సీ వివాహం శనివారం పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. వేడుకలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన అడ్వకేట్‌ను కఠినంగా శిక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను చట్టపరంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి భారత రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గాబ్రియేల్, బీబీ, లక్ష్మీదేవి, మణికుమారి, శేఖర్, ఏసన్న పాల్గొన్నారు.

మహానందిలో పెళ్లిళ్ల సందడి



వరుడిని మోసుకొస్తున్న బంధుమిత్రులు

మహానంది: క్షేత్రంలో శనివారం వీకెండ్ కావడం, ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల జరిగాయి.దీంతో వేలాది మంది భక్తులు మహానందికి వచ్చారు. ముందుగా భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు ఉప ఆలయాలను సందర్శించారు. నూతన వధూవరులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ఆత్మకూరు: సబ్ డివిజన్ పరిధిలో రానున్న దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అనుమతి లేకుండా అమ్మడం, నిల్వచేస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలకు తావు లేకుండా భద్రతా ప్రమాణాలు, సూచనలు పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలని విక్రయదారులను ఆదేశించారు. వ్యాపారులు ఎక్కువగా క్రాకర్స్ నిల్వ ఉంచినా, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా లేదా అనే విషయమై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని చెప్పారు. అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అక్రమంగా టపాసులు విక్రయిస్తుంటే డయల్ 112 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

మద్దిలేటి స్వామికి విశేష పూజలు


ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాసం సందర్భంగా శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కూటమి సర్కార్ వైఫల్యాలను ఎండగడుదాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపు

వెలుగోడు: పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఆయన ఉన్నత ఆశయానికి గండి కొడుతున్న కూటమి సర్కారు వైఖరికి వ్యతిరేకంగా గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రచ్చబండ కార్యక్రమం, కోటి సంతకాల సేకరణపై పార్టీ శ్రేణులకు శిల్పా దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి రూ.వేల కోట్లు దండుకోవడానికే చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబుకు అమరావతిలో రాజధాని నిర్మాణంపై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదన్నారు. అమరావతిలోని టీడీపీ నేతల భూముల ధరలు పెంచుకునేందుకే రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దష్టి పెడుతున్నారని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలో తెచ్చిన రూ.లక్షల కోట్లు అప్పులు ఏంచేశారని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఉద్యమిద్దామన్నారు. సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ రచ్చబండ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు చెత్తను నందికొట్కూరులో వేస్తే ఎలా?


ఆత్మకూరు నుంచి చెత్తతో వచ్చిన టిప్పర్లను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు


చెత్త తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్న మున్సిపల్ చైర్మన్, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు

నందికొట్కూరు: పట్టణంలోని దుర్వాసనతోనే అల్లాడుతుంటే ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని చెత్తాచెదారాన్ని ఇక్కడికి ఎలా తరలిస్తారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ నాయకులు ఇనాయతుల్లా(లడ్డు), ప్రజా సంఘాల నాయకులు ఫక్కీర్‌సాహెబ్ ప్రశ్నించారు. శనివారం పట్టణ సమీపంలో డంపింగ్ యార్డుకు ఆత్మకూరు మున్సిపాలిటి నుంచి చెత్తాచెదారం టిప్పర్లతో తీసుకొస్తున్న సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కుమ్మరిగేరి ప్రజలు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ నందికొట్కూరు డంపింగ్ యార్డు నుంచి దుర్వాసనను స్థానిక ప్రజలు భరించలేకపోతుంటే ఆత్మకూరు కంపును కూడా ఇక్కడికే తేవడమేమిటని నిలదీశారు. మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులిస్తారని నిలదీశారు. ఇతర ప్రాంతాలకు చెందిన చెత్తాచెదారం నందికొట్కూరు పట్టణ డంపింగ్ యార్డుకు తరలించడం తగదన్నారు. ఆత్మకూరు పట్టణం నుంచి చెత్తాచెదారం తెచ్చిన టిప్పర్లను పోలీసులకు అప్పగించారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: క్షేత్రంలో ఈ నెల 13వ తేదీన హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గో సంరక్షణ విభాగం, అన్నప్రసాద విభాగాల్లోని హుండీల కానుకలను లెక్కిస్తామని చెప్పారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

బండి ఆత్మకూరు : మండలంలోని ప్రసిద్ధిగాంచిన గంగా ఉమా సమేత ఓంకారేశ్వర ఆలయానికి, ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. అల్లే చెన్నారెడ్డి ఆలయ చైర్మన్‌గా, కె.సుబ్బలక్ష్మమ్మ, పి.లక్ష్మీదేవి, ఎం.గీత, ఎ.దివ్య, బి.బాల మద్దిలేటి, పి.హేమలత, ఏ.చంద్రశేఖర్, బి.శేఖర్, మారాసు. నారాయణ, యు.వెంకటేశ్వర రావు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ పురోహితులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ

ఆత్మకూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే అధ్యక్షతన చేపడతామన్నారు. అలాగే సమావేశంలో పట్టణ, వార్డు, మండల, గ్రామాల అనుబంధ కమిటీలను ఏర్పాటు చేస్తారని చెప్పారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

నందికొట్కూరు: ఈ నెల 16న శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాసగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు శంకుస్థాపనల కార్యక్రమం, శ్రీశైల పుణ్యక్షేత్ర సందర్శన కార్యక్రమాలకు బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, అశ్వినికుమార్, మురళి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- కార్పొరేట్ కబంధ హస్తల్లో వ్యవసాయం
- సంస్కరణల పేరుతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీస్తున్నారు
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు: పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కార్పొరేట్ కబంధ హస్తల్లో వ్యవసాయం చిక్కుకుందని, సంస్కరణల పేరుతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా 2వ మహాసభలు ఆత్మకూరులో ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ నుంచి రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్‌కుమార్ అధ్యక్షతన గౌడ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల తీరును చూస్తే..రాబోయే కాలంలో వ్యవసాయ మార్కెట్‌లను కూడా రద్దు చేస్తారేమోనన్నారు. నిత్యావసర ధరలను తగ్గించకపోవడం దారుణ్మామన్నారు. సహకార వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకోవడానికి నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. జీఎస్టీ పేరుతో జనం నుంచి ధరల రూపంలో దండుకుంటున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల పేరుతో పెద్ద ఎత్తున పేదల భూములు లాక్కుంటుండటం దుర్మార్గమన్నారు. పిన్నాపురంలో రైతుల భూములు లాక్కొని వారిని కూలీలుగా మార్చుతున్నారన్నారు. విశాఖలో లూలు కంపనీకి వందల కోట్లు భూములను అప్పనంగా అప్పగిస్తున్నారని, మెడికల్ కళాశాలలు, వాటి స్థలాలను టీడీపీ నాయకులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ట్రంప్ పన్నులు విధిస్తున్నప్పటికీ ప్రధానం నోరుమెదపకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఆత్మకూరు ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆరబెట్టేందుకు అవస్థలు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట చేతికందటంతో రైతులు ముమ్మరంగా పంటనూర్పిడి చేసుకుంటున్నారు. నూర్పిడి చేసుకున్న ధాన్యాన్ని ఆరబెట్టుకొనేందుకు సరైన వసతుల్లేకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జైన్ ఇరిగేషన్ కంపెనీ రోడ్డు, ఏపీఐఐసీ రోడ్ల వెంట రైతులు నూర్పిడి చేసుకున్న మొక్కజొన్నల ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. పంటలు చేతికుందుతున్న సమయంలో అల్పపీడనం ప్రభావం చేత వర్షాలు కురుస్తుండటంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కాపాడుకొనేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ధాన్యం తడిస్తే అమ్ముకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందని, టార్పాలిన్ పట్టాలతో కప్పుకొంటూ దిగుబడిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యాన్ని అమ్ముకోబోతే వ్యాపారులు తేమశాతం ఎక్కువగా ఉందటూ కొనుగోలు చేయకుండా సతాయించటం పరిపాటిగా మారింది. రైతులు పండించిన ధాన్యం త్వరగా ఆరబెట్టుకునేందుకు మండలానికి ప్రభుత్వం డ్రైయింగ్ యంత్రాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



జైన్ ఇరిగేషన్ కంపెనీ రోడ్డు వెంట కనుచూపు మేరలో ఆరబోసిన మొక్కజొన్నలు

రేపు ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సలహాదారులతో సోమవారం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను దేవస్థానం సిద్ధం చేస్తోంది. 17మంది సభ్యులతో దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయిస్తారు. అలాగే దేవస్థాన ప్రధానార్చకులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ప్రమాణం చేస్తారు. అనంతరం సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చైర్మన్‌గా పోతుగంటి రమేష్‌నాయుడు పేరు ఖరారైనట్లు సమాచారం. ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు మధుకర్‌జీ, విష్ణువర్ధన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిసింది.

సా..గుతున్న పనులు

జూపాడుబంగ్లా: రెండేళ్లు గడిచినా మండలంలోని పారుమంచాల ఇసుకవాగు వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారుమంచాల సమీపంలోని ఇసుకవాగు వంతెన నిర్మాణం కోసం రూ.5కోట్ల నిధులను మంజూరు చేశారు. 2023 ఆగస్టు 8న అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్ మూడు మాసాల్లో పూర్తిచేస్తానని పేర్కొని రెండేళ్ల గడిచినా పనులు పూర్తిచేయకుండా కొనసాగిస్తూనే ఉన్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుచేయడంలో జాప్యం చేయటంతో పాటు పనులపై పర్యవేక్షణ కొరవడటంతో వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పారుమంచాల, తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, వాడాల, రేగడగూడూరు, వెలుగోడు మీదుగా జిల్లా కేంద్రమైన నంద్యాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని త్వరగా ఇసుకవాగుపై వంతెన నిర్మాణం పూర్తిచేయించాలని ఉద్యోగులు, ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.


రెండేళ్లుగా ఇసుకవాగుపై పూర్తికాని వంతెన నిర్మాణ పనులు

